

రంగ ప్రవేశం
VIN...

ఆ రోజు ఆదివారం. ఆ ఒక్కరోజే బయటికి వెళ్లాలన్నా, సినిమా చూడాలన్నా తెరిపిగా ఉంటుంది. సినిమా ప్రోగ్రామ్ వేసుకున్నాము. కాని మా రేణు రవీంద్ర భారతిలో డాన్స్ ప్రోగ్రాముంది వెడదామని పట్టుపట్టింది. ఒక్కగానొక్క కూతురంటూ శ్రీవారు అతి గారాబం చేస్తారు. అందుకే కూతురు చెప్పినట్టే డాన్స్ చూద్దాం అన్నారు. "వంటా, వార్పు అంటూ హడావుడి చెయ్యకు. ఏ హోటల్‌లోనో భోజనం చేద్దాం. చేంజ్ ఉంటుంది" అన్నారు. ముగ్గురమూ తయారయ్యాము.

"మాలతీ!....ఓ మాలతీ...." మా ప్రక్కవాటాలో ఉండే ఇంజనీరుగారి భార్య పిలుపది. మేము నాల్గు సంవత్సరాలుగా కలసి ఉన్నాము.



## మాదిరెడ్డి సులోచన

అప్పుడప్పుడు మనస్పర్థలు వచ్చినా, సర్దుకుపోతూ ఉంటున్నాము.

"రా పద్మా....ఏమిటి?" అంటూ బయటికి వచ్చాను. ఆమె ముఖం చిటపటలాడుతున్నది.

"ఎక్కడికో ప్రయాణం అయినట్టున్నావు.... ఓ....సారీ! అడగకూడదేమో!" అంది ఆమె.

"లేదు పద్మా.... నా కలాంటి పట్టింపు లేమీ లేవు. డాన్స్ ప్రోగ్రాముంటే...."

"ఏం డాన్సులో ఏం పిల్లలో! రేణూ పెరుగుతున్నదన్న సంగతి తెలుసా నీకు?" తీవ్రంగా అడిగింది.

"తెలియకేం? అందుకే వెడుతున్నాం. అమ్మాయి మాట మనమూ వినాలి కదా....?" అన్నాను నేను.

"ఏడ్చినట్టే ఉంది తెలివి. మీ రేణును చూచి మా లత చెడిపోతున్నది మాలతీ!"

ఆమె మాటలు నేను భరించలేకపోయాను.

"పద్మా!"

"అవును. అదుపులో పెట్టుకోకపోతే లాభం లేదు."

"ఏం చేసింది?" అన్నాను కోపం దిగమింగుతూ.

"ఇంకా ఏం చేయాలి? డాన్సులు తైతక్కలంటూ మా లతను పాడుచేస్తున్నది. అయినా డాన్సులు ఒళ్లమ్ముకుని బ్రతికే వారికిగాని మనకెందుకు....?"

"పద్మా! నీ భావం నాకు అర్థం అయింది. రేణు ఇక ముందెప్పుడూ లత దగ్గరకు రాదు.... వెళ్ళు..." అన్నాను. నా రక్తం సల సల కాగిపోతున్నది. ఎంత మాటన్నది?

పద్మ వెళ్ళిపోయింది.

"రేణూ!" నా కేక నాకే వికృతంగా వినిపించింది.

"ఏమిటి మాలతీ?" శ్రీవారు వచ్చారు. ఆయన ముఖం గంభీరంగా ఉంది.

"అది కాదండీ, మన బతుకు మనం బతుకుదామంటే ఈ పిల్లకు పెత్తనాలు ఎక్కువయ్యాయి...."

"అమ్మా! ఆవిడ మాటలు పట్టుకుని నువ్వు తొందర పడుతున్నావా? లతకు డాన్స్ అంటే యెంత ఇష్టమో! నేను ప్రాక్టీస్ చేస్తుంటే తనే వస్తుంది. నన్ను అనుకరిస్తుంది!" రేణు నిదానంగా చెప్పింది.

"అది సరే - ఈ రోజు ఏం జరిగింది?"

"తనూ నాట్యం చూడాలని కుతూహలపడింది. ఆంటీని అడిగితే తిట్టిందట. మనతో వస్తానంది. సరే రమ్మన్నాను. మా డాన్స్ మాష్టారు తనకు వచ్చిన కాంప్లిమెంటరీ టికెట్టు ఇచ్చారు. అది లత కిచ్చాను!" అన్నది రేణు.

"చూడమ్మా! పేరెంట్స్ ఇష్టం లేని పని పిల్లల చేత మనం ఎందుకు చేయించాలి? ఇక మీద ఇలాంటివి జరగకూడదు...." మా వారు కాస్త కఠినంగానే చెప్పారు. సమయం అయిందని బయలుదేరాము. గేటు దాటి, గేటు వేస్తూ అప్రయత్నంగా వెనక్కు తిరిగి చూచాను. పద్మ వాళ్ళ పడక గదిలోనుండి రెండు కళ్ళు, నీటిలో నిండినవి—మమ్మల్నే చూస్తున్నాయని గ్రహించాను. ఒక నిట్టూర్పు వదిలి ముందు వెడుతున్న తండ్రీ కూతుళ్ళను అనుసరించాను.

యాంత్రికంగా నడుస్తున్నాను. నా ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి. పద్మ విచిత్రమైన మనిషి. మగవారితో సమానంగా నిలబడి జవాబు చెప్పే స్త్రీలకు శీలం లేదనుకుంటుంది. అంతే కాదు- చేతికి గాజులు లేని స్త్రీలను చూచి మూతి విరుస్తుంది. వారంలో నాల్గు సార్లు ఉపవాసం చేస్తుంది. అయితే అవి ఆమె సొంత వ్యవహారాలు.

సినిమాకు వెడదాం అంటే "మాలతీ! చవకబారుగా ఉంటాయి సినిమాలు! ఎందుకొచ్చిన సినిమాలు బాబూ!" అనేది.

"బావుంది. ప్రతిచోటా మంచి చెడులు రెండూ ఉంటాయి. కాలక్షేపమవుతుంది."

"కాలక్షేపానికే కరువు వచ్చిందా? నాదగ్గర పతివ్రతల కథలున్నాయి చదువు" అనేది. నా కలాంటప్పుడు బాధ కలిగేది. స్త్రీ తనను తానే వంచించుకుంటుందా, ఆమెను ఎవరయినా వంచిస్తున్నారా అన్నది ఆలోచింప తగిన విషయం. అయితే ఇలాంటి అభిప్రాయాలతో ముందుకు సాగేదెలా?

ఇంజనీరుగారికి తన క్యాంపులు, లెక్కలు తప్ప మరో గోల తెలియదు. లత తరువాత ఇద్దరు మొగ పిల్లలున్నారు. ఎప్పుడయినా పద్మ ఆపిల్లల గురించి చెబితే గట్టిగా అరుస్తాడు - అంతే.

ఒకరోజు సినీ ఆర్టిస్ట్ శ్రీకళ డాన్స్ ప్రోగ్రాముందని మేము తయారయ్యాం. లత తాను కూడా వస్తానని తయారయింది.

"ఆంటీ! అమ్మను మీరొక్కసారి అడగండి!" అన్నది.

సరేనని వెళ్ళి అడిగాను. అప్పటికి పద్మ స్వభావం పూర్తిగా తెలియదు నాకు. "మీ అన్నయ్యగార్ని అడుగు!" అన్నది. ఆయన కేంప్ నుండి యెప్పుడొస్తాడు! లతను ఎప్పుడు పంపిస్తాడు? భార్యకు తన పిల్లలను బయటకు పంపే స్వతంత్రం ఇవ్వని పురుషుల మీద అసహ్యం వేసింది. ఆ తరువాత మెల్లగా అర్థం అయింది—ఆయన్ని అడ్డం పెట్టుకుని ఈవిడే నాటకం ఆడుతున్నదని!



సూది మొన దూరనంత చిన్న పూసలతో ఏదైనా చేతిపని చేయాలనుకుంటే, సూది పూసలో దూర లేదని బాధపడకండి. ఒక చిన్న దారం తీసుకొని దాని కొనను గోళ్ళకు వేసుకొనే నైల్ పాలిష్‌లో ముంచి ఎండబెట్టండి. ఇప్పుడు ఆ ఎండిన భాగమే సూదిలా ఉపయోగపడుతుంది.

పూర్తిగా ప్రపంచం తెలియనిది అందామా? అంటే కాదు. తనూ గ్రాడ్యుయేటు. ఏమిటో వింత మనస్తత్వం!

హాలు చేరినాక బలవంతంగా నా ఆలోచనలు కట్టిపెట్టాను. తెలిసినవారు పలకరిస్తుంటే, నవ్వుతూ మాట్లాడుతూ లోపలికి వెళ్లాము. నిజమే– ప్రపంచంలో ఎన్నో సమస్యలున్నాయి. చెడ్డ వారున్నారు; మంచివారున్నారు. మనం మడి కట్టుకుని ఇంట్లో కూర్చుంటే మంచి చెడుల మధ్య తేడా యెలా తెలుస్తుంది?

పది నిముషాలు ఇంటర్‌వెల్‌లా ఇచ్చారు. అందరూ బయటికి వచ్చారు. నేను లేచాను. తలుపు దగ్గర లత నిలబడి ఉంది.

"ఎలా వచ్చావు లతా?" అని అడిగాను.

"అమ్మా, నాన్నా రామకృష్ణ మఠం వెళ్లారు ఆంటీ! తమ్ముళ్ళకు చాక్లెట్లు కొనిచ్చి, వరండాలో కూర్చుని ఇల్లు చూడమని వచ్చాను." ఆ పిల్లను లోపలికి పిల్చుకుపోయి, చివర్న ఏదో ఏర్పాటు చేశాము. ప్రోగ్రామ్ అయిపోయింది. అంతా హోటల్‌లో భోజనం చేశాము. భోజనం అయ్యాక "ఆంటీ! మీరు వెళ్ళండి. అమ్మ మీతో వస్తే నన్ను తిట్టేదికాక మిమ్మల్నీ తిడుతుంది!" అన్నది లత.

"ఇంత చీకట్లో ఒంటరిగా యెలా వస్తావు? ఆమె తిడుతుందని నిన్ను ఒంటరిగా వదిలేస్తామా? పద!" అన్నారాయన. టాక్సీలో ఇల్లు చేరాము. అప్పటికింకా పద్మ రాలేదు. పిల్లలిద్దరూ వరండాలో పడి నిద్రపోతున్నారు.

"లతా! ఇలా రావద్దమ్మా! ఇల్లు ఏదయినా అయితే.... పిల్లలు నిద్రపోయాక యెవరయినా జొరబడి సామాన్లు తీసుకుపోయే ప్రమాద ముందమ్మా" అన్నాను మందలింపుగా. లత తల వంచుకుంది. పిల్లలలో అంతర్లీనమయిన ఉత్సాహానికి కొంతవరకు తల్లి దండ్రులు ప్రోత్సాహ మివ్వాలేగాని అధికారం చూపుతూ ఆంక్షలు పెడితే వారెంతవరకు ఆచరిస్తారన్న విషయం ఆలోచించాలి. 'మా కాలం' అంటూ చాలా మంది చెబుతుంటారు. సామాజిక పరిణామంలో పిల్లల యెడ తల్లితండ్రుల దృక్పథం కూడా మారాలి. బలవంతపెట్టి పద్మ లతను ఆపగల్గిందా? లేదు. ఇంట్లోకి వచ్చేను. రేణు బట్టలు మార్చుకుని హార్లిక్స్ కలుపుతున్నది. ఆ కళ్ళల్లో తృప్తీ, సంతోషమూ పోటిపడుతున్నాయి.

నెల రోజుల తర్వాత ఓనాడు మధ్యాహ్నం పని కాగానే పత్రిక పట్టుకుని కూర్చున్నాను. పద్మ ఆదరాబాదరాగా వచ్చింది. ఆమె ముఖంలో భయాందోళనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

"రేణు ఎక్కడికి వెళ్ళింది మాలతీ?"

"బడికి వెళ్ళింది!" అన్నాను.

"బడికి వెడుతున్నారో లేదో తెలియదు మాలతీ! నిన్న లత బడినుండి రిపోర్ట్ వచ్చింది. వారం రోజులుగా బడికి రావటంలేదట!" అన్నది పద్మ ఆదుర్దాగా.

"ఈ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు కదా ఎక్కడయినా కూర్చుని చదువుకుంటున్నారేమో!" అన్నాను.

"అది....కాదు...." పద్మకు కన్నీరు ఉబికి వస్తున్నది. "ఇంట్లో కొన్ని వస్తువులు మాయం అయ్యాయి. దాని బట్టల బీరువా ఖాళీగా ఉంది." ఇక ఆపుకోలేనట్లు బావురుమంది పద్మ. ఇద్దరమూ వెళ్ళి మరోసారి వెతికాము. పోలీసులకు రిపోర్ట్ ఇవ్వటానికి భయపడింది. తెలిసిన చోట్లు, వెళ్ళే ఊళ్ళు వెతికాము. కాలం గడిచింది. లత జాడే తెలియలేదు. పద్మ పూర్తిగా దిగజారి పోయింది. ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వేరే ఊరు వెళ్ళి పోయారు. వెళ్ళేముందు "అది చచ్చిందనుకుంటాను!" అన్నది పద్మ. తనది గాయపడ్డ మనస్సు. నేను ఏం చెప్పగలను? రేణును దగ్గరగా తీసుకుంది. కంట తడి పెట్టుకుంది.

రెండు సంవత్సరాలు గడిచి పోయాయి. రేణు ఇంటర్ పాసయి మెడికల్ కాలేజీలో చేరింది. చదువు వైపు పడింది దాని ధ్యాస. డాన్స్ ఉత్సాహం రంగ ప్రవేశంతోనే ఆగి పోయింది. రెండు, మూడు లోకల్ ఫంక్షన్లలో నాట్య ప్రదర్శన ఇవ్వమని తెలిసిన వారు అడిగారు.


"చదువు దెబ్బ తింటుంది—ప్రాక్టీస్ చేస్తుంటే. నాకు సీటు రావాలమ్మా!" అంటూ రేణు అంగీకరించలేదు. మేమూ బలవంతం చెయ్యలేదు.

మా వారి మిత్రుడి కూతురి వివాహానికి మద్రాసు నుండి ఆహ్వానం వచ్చింది. ఒక నెల రోజులు సెలవు పెట్టి విశ్రాంతి తీసుకుని, పెళ్ళి చూచి రావచ్చని ప్రయాణం అయ్యాము. మూడు సంవత్సరాలుగా రేణు పరీక్షలు, చదువు ఓ దారిన పడాలని యెక్కడికీ వెళ్ళలేదు. ఒక కోర్సులో చేర్పించాము. అది కష్టపడో, ఎలాగో పూర్తి చేస్తుందన్న నమ్మకముంది.

మద్రాసులో దిగాము. సాయంత్రం కుమారి లావణ్య భరతనాట్య రంగప్రవేశం ఉందని తెలిసిన ప్రొడ్యూసర్ ఆహ్వానించారు.

"మన పిక్చర్‌లో చిన్న రోల్ వేస్తున్నది ఆ అమ్మాయి" అన్నాడాయన. పనేముంది– విశ్రాంతి కోసం వచ్చిన వారికి?

"రేణు ఉంటే బావుండేది!" అని రెండు మూడుసార్లు ఆయన అన్నారు. ఎక్కడికి వెళ్ళినా ముగ్గురమూ కలిసే వెళ్ళేవారము. ఆ వెలితి కనిపిస్తూంది. ప్రొడ్యూసరు కారు పంపారు. వెళ్ళేసరికే కార్యక్రమం ప్రారంభమయింది. నాట్యం చేసే లావణ్యను చూచి ఉలిక్కి పడ్డాను. ఆమె లత! యవ్వనం తాలూకు ముద్రలలో ముగ్ధ మనోహరంగా మారినా, గుర్తుపట్టగలిగాము. "మాలతీ, మన లత కదూ?" ఆయన నిటా



పాకెట్స్ కట్టిన పురికొసలను పూరికే వృధాగా పారేయకండి. అవి ఒక ఉండలా చుట్టి ఉంచితే వాష్‌బేసిన్‌లు, వంట సామగ్రీ తోముకోడానికి ఉత్తమంగా పని చేస్తాయి.

రుగా కూర్చున్నారు. అతి చాకచక్యంతో నాట్యం చేస్తూ చూపరులను ఆకట్టుకుంటున్నది లత. ప్రోగ్రాం ముగిసింది. ఒక్కసారి లతను కలిస్తే బావుండును. కాని ఎలా? ఆ నిర్మాతను అడిగితే వివరాలు తెలుస్తాయి అనుకుని లేచాము.

" మిస్ లావణ్య మిమ్మల్ని ఒక సారి రమ్మంటున్నది!" అని ఒక యువకుడు వచ్చాడు.

"మమ్మల్నేనా?" సందేహంగా అడిగాను.

"మిమ్మల్నే!" అన్నాడు అతను. అతని వెన కాల వెళ్ళాము. మేకప్పు తీసివేస్తున్నది లత. "ఆంటీ!" అంటూ వచ్చి కౌగిలించుకుంది. అప్రయత్నంగా నా చేతులు ఆమెను చుట్టాయి. నా కళ్ళు చెమర్చాయి. "రేణు బావుందా?" అని అడిగింది లత.

"బావున్నావా లతా? రేణు నిన్ను తలవనిరోజు లేదు!" అన్నాను. "చాలా బావున్నాను ఆంటీ....ఓ....అంకుల్ కూడా వచ్చారే! నిజంగా ఈ రోజు నా జీవితంలో శుభదినం!" అంటూ నన్ను వదిలి ఆయన కాళ్ళకు నమస్కరించింది. ఆయన లేవనెత్తి అక్కున చేర్చుకున్నారు. ముగ్గురికి మాటలు కరువయ్యాయి.

"మిస్ లావణ్యా, బయట మీకోసం రామన్ గారు ఎదురు చూస్తున్నారు!" అంటూ మమ్మల్ని పిలిచిన యువకుడే చెప్పాడు.

"సారీ ఆంటీ, రేపు భోజనానికి మా ఇంటికి రండి!" అంటూ త్వరగా వ్యానిటి బ్యాగు సర్దుకుంది లత.


"మంచిది!" అన్నాను. ఇద్దరమూ హోటల్‌కు వచ్చాము. ఆ తరువాత మనసంతా చేదు మింగినట్టుగా ఉంది. ఇద్దరం మౌనంగా గడిపాము.

"అంకుల్! తల్లిదండ్రులు పిల్లలను అర్థం చేసుకున్నప్పుడు, ఆ పిల్లలంత అదృష్టవంతులుండరేమో! కొందరు తల్లిదండ్రులు తమ పిల్లల అభిరుచిని అణగదొక్కి తమ ఇష్ట ప్రకారం శాసిస్తారు. అలాంటప్పుడు అందరూ కాకపోయినా కొందరయినా నాలా బయట పడతారు...."


"నేను వివరణ అడగలేదు లతా!" అన్నారు ఆయన.

"అదే, అంకుల్! ఆ మాటే చెబుతున్నాను. నేను స్థిరపడ్డ తరువాత ఉత్తరం రాశాను. వారు నన్ను మరణించిన వారిలో జమచేశారట. మళ్ళీ ఉత్తరం వ్రాయవద్దన్నారు."

పద్మ అంత కఠినంగా యెలా ఉండగలిగింది?




స్టవ్‌లో కిరోసిన్ బదులు డీసెల్ ఆయిల్ కూడా వాడవచ్చు. ప్రతి 10 లీటర్ల డీసెల్ ఆయిల్‌కి ½ కప్పు క్రిస్టల్ సాల్ట్ (ఉప్పు) కలిపితే వంట చేసేప్పుడు సామానులు మసి బారకుండా ఉంటాయి.



కాఫీ పొడితో డికాషన్ తయారు చేసుకున్నాక ఆ అడుగున మిగిలిపోయిన కాఫీ పొడితో జిడ్డుగా ఉన్న సామగ్రి తోమితే మిలమిల మెరుస్తాయి.

ఈ చిట్కాలు పంపినవారు:
జి. విజయశ్రీ (గుప్త)

"లతా! నువ్వు వారిని యెంత క్షోభపెట్టావో నీకు అర్థం కాదమ్మా" అన్నాను నేను.

"ఎందుకర్థం కాదు! వాళ్ళెప్పుడయినా నన్ను అర్థం చేసుకోవాలని ప్రయత్నించారా! అమ్మాయిలతో మాట్లాడినా చెడి పోతాననుకునే స్వభావాన్ని యెలా అంచనా వెయ్యాలో మీరే చెప్పండి!" అన్నది. మాట్లాడక కూల్‌డ్రింక్ తీసుకున్నాము.

"మన డాన్స్ మాష్టారి తమ్ముడిని బ్రతిమాలి ఈ ఊరు వచ్చాను అంకుల్. చిన్న, చిన్న వేషాలు వేస్తూ నాట్యం అభివృద్ధి చేసుకోవాలనుకున్నాను. ఆలోచనకూ-ఆచరణకూ చాలా తేడా ఉంటుందని అనుభవం మీద తెలుసుకున్నాను. ఆశకూ, ఆశయాలకూ పొత్తుకుదరదని తెలిసింది. ఆశకు నీరుపోసి పెంచాను. ఆశయాలను సమాధి చేశాను. నేను ఒక పేరు మోసిన వర్తకుడికి...." అంటూ లత నిర్జీవంగా నవ్వింది. ఆమె నవ్వు ఆమె స్థితికి అద్దం పట్టింది.

"లతా!" అన్నాను బాధగా.

"అవును ఆంటీ! దీనికి యెవరినీ నిందించను. నన్ను నేనే నిందించుకుంటానేమో అవసరం వస్తే...."

నా హృదయం భారమయింది. ఒక మధ్య వయస్కుడు షర్ట్ బటన్ పెట్టుకుంటూ మేడ దిగాడు. చూడడానికి అందంగానే ఉన్నాడు. "రామన్....మా ఆంటీ, అంకుల్"...అన్నది లత.

అతను నమస్కరించాడు. ఆ తరువాత ఒక గంట పిచ్చాపాటి మాట్లాడాక రామన్‌కు పని ఉందని త్వరగా భోజనాలు వడ్డించారు. భోజనం అయ్యాక అతను వెళ్ళిపోయాడు. లత రేణు గురించి అడిగింది. చెప్పాను.

"రామన్ అవివాహితుడా!" ఉండబట్టలేక అడిగాను నేను.

"లేదు ఆంటీ! అతని కుటుంబం బొంబాయిలో స్థిరపడింది. వ్యాపారరీత్యా నెలలో పదిరోజులు ఇక్కడే ఉండాల్సి వస్తుంది."

"జాగ్రత్తమ్మా!" అనాలనుకున్నాను. కాని అనలేకపోయాను. లత మానసికంగా యెదిగి పోయిందేమో!

"ఇల్లంతా ఆయనే నడుపుతారు ఆంటీ. నా డబ్బు నాది. ఆయన పట్టించుకోరు. నా కార్యకలాపాలకు అభ్యంతరం చెప్పరు. ఆఁ....మీకు అభ్యంతరం లేకపోతే నెలవుల్లో రేణును పంపండి ఆంటీ!"

"తప్పకుండా పంపుతాము!" అని బయలు దేరాము. లత గేటువరకు వచ్చి సాగనంపింది.

"వెళ్ళేలోపున మరోసారి రండి ఆంటీ...." అన్నది లత.

"అలాగే" అన్నాను. బరువెక్కిన హృదయంతో కారెక్కాను. కాని పొరపాటు ఎక్కడ జరిగిందో, ఎవరిదో అని మాత్రం నిర్ణయించుకో లేకపోయాను. లత, పద్మ ఇద్దరూ తీవ్రస్వభావం కలవారే!

*